క్రీస్తువెనుక' అన్నట్లు చెప్పు కోవాలేమో! - మరియు - అమ్మీ నీకు తెలియదుగాని మన హిందూ రిలిజన్ చాలా ఫ్లెక్సిబుల్ - మడతమంచంలాగా వాలుకుర్చీలాగా అప్పడాల పిండి లాగా సాగుతుంది. ఇది ధర్మ విహితమే - అయితే కొంచెం రాక్షస నీతి ప్రకారం అని చచ్చినట్లు ఒప్పుకోక తప్పదు.

విడాకులిచ్చిన స్త్రీలు పునర్వివాహాలు చేసుకోవచ్చు కదా - ఆస్తి కోసం స్త్రీలకు విడాకులిస్తే "వుమన్స్ లిబ్" అవసరం లేకుండా ఆర్థిక స్వాతంత్ర్యంతోపాటు సెక్సు స్వాతంత్ర్యం కూడా యిచ్చినట్లవుతుంది కదా!

కుంచం తిరగేస్తే నాలుగు గింజలేనా మిగుల్తాయన్నట్లు ఈ విధంగా కోర్టులద్వారా స్త్రీకి హెచ్చు అధికారాలూ ఆర్థిక స్వాతంత్ర్యం లభిస్తే సంతోషించాలి మరి. భర్తలంటారా "మెన్‌మేకం అండ్ మెన్ మే గో" అంటారు విడాకుల డాకూలు.

విడాకులిచ్చిన సంపన్న గృహిణులు మళ్ళీ మిస్‌లవుతారు కాబట్టి దమయంతికి ద్వితీయ స్వయంవరం చాటించినట్లు ఆస్తులకోసం కాపురాలు కూలద్రోసుకుంటున్న ఈ ఆధునిక ఆస్తి (క) దమయంతులకు ద్వితీయ స్వయంవరాలు కూడా ఏర్పాటుచేస్తే ఎవరూ ఆశ్చర్యపోనవసరంలేదు.

అంతా మన పురాణాల్లో హిందూ రిలిజిన్‌లో వున్నదే గదండీ.

# పాడిందే పాట

మనిషి తానుగా ఏదీ నిర్ణయించుకొందుకు సమర్థుడుకాదు. అతనికా అవకాశం లేదు. మనిషి స్వతంత్రుడు కాడు. అతని జీవితం సంపూర్ణం కాదు, అతని ఆలోచనలు, అతని నిర్ణయాలు అతనివి కావు. తానుగా ఏదీ నిర్ణయించుకుందుకు అవకాశం యివ్వకుండా తాము చెప్పినట్లు సామాన్యుడ్ని లొంగదీసుకొనటం కోసం పబ్లిసిటీ బాగా వుపయోగపడుతుంది. ఈ పబ్లిసిటీని నమ్ముకుని చెత్త సినిమాలు చూడటం, చెత్త పుస్తకాలు చదవటం, పనికిరాని వస్తువుల్ని కొనటం, పోరంబోకు సంస్థల్నీ మనుషుల్నీ నమ్మటం లాటిది సామాన్యుడు చేస్తున్నాడు. ఒక విషయాన్ని పదే పదే చెప్పటం వలన నిజం కామోసు అనే భ్రాంతి కలుగుతుంది. నిజం అయినా కాకపోయినా పాడిందే పాటగా పాడుతుంటే జనం నమ్మేస్తారు, జనాన్ని మోసం చేయాలంటే ముందు వారిని నమ్మించాలి. నమ్మని వారిని మోసగించటం సులభంకాదు. భారీఎత్తున పబ్లిసిటీ జరిగే ప్రతి విషయంలో భారీ ఎత్తున మోసం జరిగే అవకాశం వున్నట్లే లెక్క. రాజకీయాలలో దగాకోరుతనం వుంది. వాణిజ్యంలో సరేసరి. అది ఎప్పుడూ వుండనే వుంటుంది తోడు పెళ్ళికూతుర్లా. జీవితంలో కూడా వుంది. కళల్లోకి ఎప్పుడో ప్రాకింది.

ప్రచారం వలన జరిగే మోసం, అన్యాయం చట్టబద్ధమైనవని వప్పుకుని తీరాలి. వీటిని ఎదుర్కొనడానికి సామాన్యుడు అసమర్థుడు.

ఇది కుటుంబాల్లో కూడా వుంది. ఎదుటివారి గురించి చెడుప్రచారం చేయకుండా తమ గురించి మంచిని ఎక్కువగా చెప్పుకోవటం సెల్ఫ్ పబ్లిసిటీ క్రిందే లెక్క.

ఒక తల్లి "మా వాళ్ళందరికీ ఫస్టుమార్కులు. క్లాసులోనూ పిల్లలంతా తెలివైనవాళ్లు, బుద్ధిమంతులు" అని తన బిడ్డల్ని వాళ్ళ ఎదురుగానే తెగ మెచ్చుకొంటుంది. వాళ్ళు కూడా మా అమ్మ దేవత చాలా మంచిది అంటారు. నిజానికి వాళ్ళంతా సమానమైన తెలివి కలవారు కాదు ఏదో మామూలుగా చదువుకొంటారు. ఆవిడ కూడా ఆదర్శమాత ఏమీ కాదు. సినిమాలకు, కాఫీలకు డబ్బులివ్వాలిసొస్తుందని మా పిల్లల కేమీ చెడు అలవాట్లు లేవు. డబ్బులిమ్మని అడగరు యిస్తే పుచ్చుకోరు అనే ప్రచారం చేస్తుంది. ఆ కుటుంబంలోని వారంతా కొన్ని గళ్లు గీసుకుని ఆ గళ్ళ మధ్య జాగ్రత్తగా వుంటారు. బెంచీ టిక్కెట్టుకే వెళ్ళాలి సినిమాకు. రేడియో వినాలంటే పార్కుకో, ఎదురింటికో వెళ్ళాలి కాని కొనమని అడగకూడదు (రేడియో వుంటే పిల్లల చదువులు చెడిపోతాయి)ఇంట్లో విస్త్రీ బట్టలు కట్టుకుని తిరగకూడదు. ఒక పండగకి కొన్న కొత్త బట్టల్ని కనీసం తడపకుండా రెండు పండగలకి కట్టుకోవాలి. ఎవరైనా చుట్టాలొచ్చినపుడు డబ్బులిస్తే అవి వాళ్ళు వెళ్ళాక మర్యాదగా పట్టుకొచ్చి అమ్మకిచ్చెయ్యాలి. అమ్మ అవన్నీ కిడ్డీబ్యాంకులో దాచిపెడ్తుంది. మనం టిఫిన్లూ కాఫీలు చేసే వేళ ఫ్రండ్స్‌ని ఇంటికి తీసుకురాకూడదు. వాళ్ళని అరుగుమీద నుంచోమని కావలిస్తే మంచినీళ్ళివ్వాలి. ఇంట్లోకి తీసుకొచ్చి నెత్తిమీద ఎక్కించుకోకూడదు. పత్రికలు, పుస్తకాలు కొని చదవకూడదు. ఊరికేతెచ్చి చదవాలి, చందాలవాళ్ళని ఇంటికి రానివ్వకూడదు. అమ్మా నాన్న లేరని చెప్పి పంపించాలి. హరికథలకి పురాణాలు వింటానికి గుళ్ళోకెళ్ళినా హారతిపళ్ళెం రాకుండా వచ్చేసెయ్యాలి. మనింట్లో రెండు మూడు రోజులు వుండి భోంచేసిన బంధువులచేత చెప్పులు, పెన్నూ, రిబ్బన్లు, రుమాళ్ళు అడిగికొనిపించుకున్నా తప్పులేదు. ఇవన్నీ జీవితపు రూల్సు.

మావారి కజి నొకావిడుంది. ఆవిడ తలనొప్పి సుందరి. ఇంకే రోగం లేకపోతే ఆవాళ తలనొప్పయినా వుండి తీరాల్సిందే. ఆవిడ ఆటో బయాగ్రఫీ చెబుతుంది. అంతా తనకు వచ్చిన రోగాల గురించి, తను పడ్డ అవస్థల గురించే తనకు జరిగిన ఆపరేషన్లూ, యిచ్చిన ఇంజక్షన్లూ, చెల్లించిన బిల్లులూ, ఆసుపత్రిలో ఆవిడ గడిపిన రోజులూ అన్నీ వర్ణించి మీకు ఏ రోగమూ లేక శుభ్రంగా ఆరోగ్యంగా వుండటం ఒక దురదృష్టమేవో నని మీకు అనుమానం కలిగేలా చేస్తుంది. ఒక ఆపరేషన్‌గాని, ఒక మారైనా సెలైన్ యివ్వటం కాని, ఒక యాభై ఇంజెక్షన్లుగాని పుచ్చుకోలేదంటే మీరు చాలా అనాగరికుల క్రిందే లెక్క. ఏదో ఒక రోగంతో తీసుకుంటూన్నట్లు చెబుతూ ఆవిడ కూర్చున్నచోటనుంచి లేవదు. ఇక్కడ పుల్ల అక్కడ పెట్టదు. ఆవిడ ఒకవేళ లేచినా మీరే అనేస్తారు ఏం లేస్తావులే మళ్ళీ పడిపోతే అప్రతిష్ఠ అని.

మరొక రకం మనుషులున్నారు. వాళ్ళు మా ఆవిడ అనకుండా మాట ఎత్తలేరు. వాళ్ళావిడ అప్పుడెటువంటి స్థితిలోవున్నా ఆవిడ్ని రెక్కపుచ్చుకు మాటల మధ్యలోకి యీడ్చుకురావలసిందే. వాళ్ళు తాము చెప్పే దానికి వత్తాసుకోసం ఆవిడ్ని కూడా యీడ్చుకొచ్చి మన్ని మభ్యపెడతారు. మనం ఎప్పుడైనా ఆవిడ్ని చూడటం పడితే ఈ మాటల సుందరి మాయమైపోయి మనకు ఉపన్యాసకుడిచ్చిన పిక్చర్‌కి పూర్తిగా భిన్నమైన శాల్తీ కనపడుతుంది.

దుష్ప్రచారం అని ఏదైతే వుందో దాన్ని ఎదుర్కొనటం సులువు. కాని స్వయంప్రచారం చేసుకునేవారు వదిలే అజాగ్రత్త బాణాలే సూటిగా గుచ్చుకొని మన్ని గిలగిల్లాడించేస్తాయి.

ఏ సబ్బువాడాలో సబ్బుల కంపెనీల ప్రకటనలు నిర్ణయించినట్లు, వాడవలసిన దుస్తులు, చదవవలసిన పుస్తకాలు, చేయవలసిన స్నేహాలు, చూడవలసిన సినిమాలు, తినవలసిన వస్తువులూ అన్నీ మనకోసం ఎవరో ముందే నిర్ణయంచేసి ఉంచినట్లు కనపడుతుంది. ప్రీ పబ్లిసిటీవల్ల కుటుంబ జీవితమే గాకుండా వ్యక్తి జీవితాలూ ఎవరో నిర్దేశించినట్టు నడవ్వలసివస్తోంది. ఇది ఆలోచించినకొద్దీ మరీ దారుణమైన విషయం అని తోస్తుంది.

# పీచుమిఠాయి వేటలో...

**నూ**లుచీర కట్టడమా, పట్టుచీర ధరించడమా – వాయిల్‌చీర చుట్టబెట్టుకోడమా. సిల్కుచీర సింగారించడమా, స్లిప్పర్లు వేసుకోవడమా బెల్టు షూ బిగించడమా, బన్‌పెట్టి జుత్తు గోపురంలా వేసుకోడమా, చిన్న ముడి వేసుకొంటే చాలా, వెనక 'వి' షేపు జాకెటు తొడగడమా, సంసార పక్షంగా లోనెక్ కాకుండా పట్టు రవిక వేసుకోవడమా – ఇలా యిలా నిత్య సందేహాలు లక్షరకాలివి క్వశ్చన్ మార్కుల్లా వచ్చి నిలుస్తాయి నాకు. నాకనేమిటి? ప్రతిభామిని డ్రెస్సప్పవటంలో, అలంకరించుకోవటంలో 'ఎలా వుంటే బాగుంటాను' అని సతమతం కావటం అన్నాచురల్ అని కొట్టి పారేయటం తగదు. ఆడవారి బాధలు ఆడవారివి. వీటినే అలంకరణ కోసం అద్దం ముందు కుస్తీపట్లు అని అన్నా అనవచ్చు. కుస్తీ ఎవరితో–మనసుతో – మనసు వెర్రిబాగులది–అది గుర్రం–మనసు గుర్రమురోరి మనిషి అన్నారు కవిగారు. గుర్రానికీ సమస్యలుండవనుకోండి దవుడు తీయడం తప్ప.

మనం సుఖంగా జీవించాలంటే కోరికల్ని పెంచుకోవడం తప్పంటారు వేదాంతులు. ఇవి చిన్న కోరికలే కదా – యివీ లేకపోతే జీవితం డల్‌గా మరియు మరోజుగా వుంటుందని వాపోతారు లలనామణులు. కాని మనం ఎంతవరకు మనకోసం జీవిస్తున్నాం. ఎంతవరకు యితరుల కోసం జీవిస్తున్నాం అనే ప్రశ్నకు ఎప్పుడో ఒకప్పుడు ఎక్కడో ఒకచోట జవాబు చెప్పుకోవాల్సుంటుంది. మనం మనకోసమే జీవిస్తున్నాం కాని ఇతరుల కోసం కాదు అనేది